బీజేపీ సిందూరం.. మహిళలు గరం గరం

మొదటిపేజీ తరువాయి...

ప్రారంభం కావాల్సి ఉన్నది. అయితే, ఈ ఏడాది అక్టోబర్‌లో బీహార్ అసెంబ్లీకి, వచ్చే ఏడాది మార్చిలో బెంగాల్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో ఆయా రాష్ట్రాల్లోని కొందరు స్థానిక బీజేపీ నేతలు ట్రయల్ రన్‌లో భాగంగా ఈ సిందూర అభియాన్‌ను ముందుగానే ప్రారంభించారు. అయితే, వారు ఊహించని పరిణామం ఇక్కడే ఎదురైంది. సిందూరాన్ని పంపిణీ చేయడానికి ఇంటింటికీ వెళ్లిన బీజేపీ కార్యకర్తలకు ఆ ఇంట్లోని ఆడపడుచుల నుంచి తిట్లు, ఈసడింపులే ఎదురయ్యాయి. 'రాజకీయాలకు ఆపరేషన్ సిందూర్‌ను వాడుకోవడం ఏంటి?', 'పహల్గాం ఉగ్రవాదులను పట్టుకోలేరు గానీ, సిందూరం పంపిణీ చేయడానికి వచ్చారా?' అంటూ ఆయా మహిళలు బీజేపీ కార్యకర్తలపై దుమ్మెత్తిపోయడం పలు వీడియోల్లో కనిపిస్తున్నది. 'భార్యకు భర్త సిందూరాన్ని ఇవ్వాలిగానీ, పార్టీ ఇవ్వడమేంట'ని బీజేపీ కార్యకర్తను ఓ మహిళ నిలదీస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

సిందూరం పేరిట ఓట్లు అడుక్కోవడమా?

భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను రాజకీయ లబ్ధికి బీజేపీ వాడుకొంటున్నది. సిందూరం పేరు చెప్పి ఓట్లు అడుక్కోవడం ఏంటి? ఈ చర్యలతో పవిత్ర సిందూరాన్ని బీజేపీ అపహాస్యం చేస్తున్నది.

– పంజాబ్ సీఎం భగవంత్ మాన్

మోదీజీ.. ముందు మీ భార్యకు ఇవ్వండి

ప్రతీ మహిళకు గౌరవం ఉంటుంది. భర్త నుంచి మాత్రమే మహిళ సిందూరాన్ని అంగీకరిస్తుంది. మీరు (మోదీ) దేశంలోని మహిళలందరికీ భర్త కాదు కదా?! ముందు మీ భార్యకు ఆ సిందూరాన్ని ఇవ్వండి.

–బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

పీఐబీతో పోస్టులు

'సిందూర అభియాన్'పై ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో బీజేపీ నేతలు పునరాలోచనలో పడ్డట్టు తెలుస్తోంది. ప్రస్తుతానికి ఈ కార్యక్రమాన్ని పక్కనబెట్టాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇందులో భాగంగానే అసలు ఆ కార్యక్రమం తీసుకురావాలన్న చర్చే తమలో జరుగలేదని కమలనాథులు చెప్పుకొచ్చారు. ఈ మేరకు 'నాగ్‌పూర్ టుడే' ఓ కథనంలో తెలిపింది. 'సిందూర అభియాన్' ఫేక్ ప్రచారమని బీజేపీ ఎంపీ సంబిత్ పాత్రా వంటి నేతలు బుకాయించడం ప్రారంభించారు. 'సిందూర అభియాన్'పై పత్రికల్లో వచ్చిన వార్తలను ఫేక్ న్యూస్ అంటూ పీఐబీ ఫ్యాక్ట్ చెక్‌తో పోస్టులు పెట్టించారు.

'మీ రక్షణ కోసమే సిందూర్‌ను పంపిస్తున్నారు..' అన్న రిపోర్టర్‌పై మహిళలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'మీరెవరు సిందూరం ఇవ్వడానికి? నా భర్త నపుంసకుడా?' అని ఓ మహిళ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మేం పెళ్లి చేసుకున్న వాడు మాకు రక్షణ కల్పిస్తాడు. మా ఇండ్లలోకి వచ్చి సిందూరం ఇచ్చేందుకు మీరెవరు? ప్రధాని ఇలాంటి నీచ పనులు చేస్తుంటే సిగ్గుగా ఉంది' అని ఆగ్రహం వ్యక్తంచేసింది. తన భర్త తనకు సిందూరం తెచ్చి ఇస్తాడని, సిందూరం ఇచ్చేందుకు మీరెవరని మరో మహిళా ప్రశ్నించింది.

'సిందూరాన్ని సోదరుడు ఎలా ఇస్తాడు. మీరు ఇస్తున్నారు బాగుంది. మేం తీసుకుంటాం. కానీ, దానిని నుదుటన దిద్దుతారా? సిందూరం ఇస్తే దానిని నుదుటన దిద్దాలి. ఇచ్చేవాళ్లు దిద్దాలి కదా!' అంటూ తనకు సిందూరం ఇచ్చేందుకు వచ్చిన వ్యక్తులను మహిళ నిలదీసింది. దీంతో తాను దిద్దలేనని ఆమెకు సిందూరం ఇవ్వజూపిన వ్యక్తి చెప్పారు. దీంతో ఆయనతో వచ్చిన వారిలో ఒకరికి ఆ సిందూరాన్ని దిద్దాలని అడగ్గా 'నేనెలా దిద్దుతాను దీదీ' అని అనడంతో, మరో వ్యక్తిని కూడా ఆమె అదే ప్రశ్న వేసింది. ఆయన కూడా సోదరికి తాను సిందూరాన్ని దిద్దలేని తనను క్షమించాలని కోరాడు. సిందూరాన్ని నుదుటన దిద్దలేనప్పుడు ఎందుకు ఇస్తున్నారని ఆమె ప్రశ్నించింది. అయినప్పటికీ వదలని వారు ఆమెను సిందూరం తీసుకోవాలని బతిమాలారు. తమకు రక్షణ కల్పించలేనప్పుడు సిందూరం ఇచ్చి ఏం లాభమని నిలదీస్తూ ఇంట్లోకి వెళ్లి గాజులు తెచ్చింది. ఈ గాజులు తొడుక్కుని తనకు సిందూరాన్ని దిద్దాలని అడగడంతో వారు బిక్కచచ్చిపోయారు. ఇది దేశభక్తికి సంబంధించిన విషయమని ఆమెకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఆమె వినిపించుకోకపోవడంతో అక్కడి నుంచి జారుకున్నారు.

మోదీ.. జాతికి జవాబు చెప్పండి!

మొదటిపేజీ తరువాయి...

మోదీ సహా ప్రభుత్వ పెద్దలు ఎవ్వరూ నోరు మెదపడం లేదు. దీంతో పహల్గాం ఉగ్రదాడి ఘటన, అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని ప్రతిపక్షానికి చెందిన 16 పార్టీల ప్రతినిధులు ప్రధాని నరేంద్రమోదీకి మంగళవారం లేఖ రాశారు. ఈ లేఖపై లోక్‌సభకు చెందిన 200 మందికి పైగా విపక్ష ఎంపీలు సంతకాలు చేశారు.

వేటిపై చర్చకు పట్టుబట్టారంటే?

పహల్గాం ఉగ్రదాడి, ఆ తర్వాత చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన విషయాలపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చర్చించాలని విపక్ష పార్టీల నేతలు మంగళవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత్-పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందానికి తానే మధ్యవర్తిత్వం వహించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై కూడా ఈ సందర్భంగా చర్చించాలని పట్టుబట్టారు. సరిహద్దు గ్రామాల్లో పాక్ రేంజర్లు జరిపిన షెల్లింగ్‌లో ప్రాణాలు విడిచిన పౌరుల గురించి కూడా చర్చించాలని గుర్తు చేశారు. పహల్గాం ఉగ్రదాడి తదనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విషయంలో తమ ప్రతిపక్ష పార్టీలన్నీ ప్రభుత్వానికి మద్దతునిచ్చాయన్న విపక్ష నేతలు.. తమ డిమాండ్ మేరకు కేంద్రం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

సైన్యానికి అభినందనలు చెప్తాం

'పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని 16 పార్టీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. పార్లమెంట్‌కు ప్రభుత్వం బాధ్యతాయుతంగా ఉండాలి. ప్రజలకు పార్లమెంట్ బాధ్యతాయుతంగా ఉండాలి' అని టీఎంసీ నేత డెరెక్ ఒబ్రియాన్ మీడియాతో అన్నారు. 'ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా చేపట్టిన సైన్యానికి అభినందనలు తెలియజేస్తాం. అలాగే, పాక్‌ను ఏకాకిగా చేసి, ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు కేంద్రం తీసుకొన్న చర్యలు, 'ఆపరేషన్ సిందూర్'పై నిజానిజాలను ప్రత్యేక సమావేశంలో చర్చిస్తాం' అని కాంగ్రెస్ నేత దీపేంద్ర హుడా తెలిపారు. 'కాల్పుల విరమణపై ట్రంప్ ఎందుకు ప్రకటన చేయాల్సి వచ్చిందో చర్చించాలి' అని ఎన్సీ నేత రామ్‌గోపాల్ యాదవ్ అన్నారు.

సెషన్ కోసం.. ట్రంప్ వద్దకు వెళ్లాలా?

16 ప్రతిపక్ష పార్టీల నేతలు సంతకాలు చేసిన లేఖను ప్రధాని మోదీకి పంపాం. ఇది సాధారణమైన విషయం కాదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచనల మేరకు కాల్పుల విరమణ ప్రకటించినప్పుడు.. మేం ఎన్నిసార్లు కోరినా పార్లమెంట్ ప్రత్యేక సెషన్ ఎందుకు ఏర్పాటు చేయరు? ప్రత్యేక సెషన్ ఏర్పాటు కావాలంటే మేం ట్రంప్ వద్దకు వెళ్లాలా?

–సంజయ్ రౌత్, శివసేన (యూబీటీ)



నరేందర్.. సరెండర్ : రాహుల్

కాల్పుల విరమణకు సంబంధించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిళ్లకు ప్రధాని మోదీ లొంగిపోయారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. ఈ మేరకు భోపాల్‌లో మంగళవారం ఓ కార్యక్రమంలో తీవ్ర విమర్శలు చేశారు. 'బీజేపీ-ఆరెస్సెస్ నేతలపై కొంచెం ఒత్తిడి తీసుకొచ్చినా వాళ్లు భయంతో పారిపోతారు. ట్రంప్ అక్కడి నుంచి మోదీకి ఫోన్ చేసి.. 'నరేందర్.. సరెండర్' అన్నారు. అంతే, 'యెస్, సార్' అంటూ మోదీ లొంగిపోయారు' అంటూ ఎద్దేవా చేశారు.

ఈ ప్రశ్నలకు బదులేదీ?

- సెక్యూరిటీ మాక్ డ్రిల్.. టెరిటోరియల్ ఆర్మీ.. ఎయిర్‌రైడ్ సైరన్లు.. అంటూ హడావుడి చేసి యుద్ధం కోసం ప్రజానీకాన్ని సిద్ధం చేశారు. ఆ వెంటనే ఎందుకు యూటర్న్ తీసుకొన్నట్టు?
- పాకిస్థాన్ వైమానిక స్థావరాలను మన సైన్యం కూల్చేసి యుద్ధంలో పైచేయి సాధించిందన్నారు. అలాంటప్పుడు కాల్పుల విరమణకు ఎందుకు అంగీకరించారు?
- భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణకు తానే మధ్యవర్తిత్వం వహించానని ట్రంప్ ఇప్పటికే చాలాసార్లు ప్రకటించారు. ఇది నిజమేనా?
- వాణిజ్యం నిలిపేస్తామంటూ బెదిరిస్తేనే కాల్పుల విరమణకు భారత్ ఒప్పుకొందని ట్రంప్ చెప్పారు. ఇది నిజమేనా?
- 'కామన్‌సెన్స్' అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలతో ట్రంప్ భారత్‌ను కించపరిచే విధంగా మాట్లాడారు. దీన్ని ఎందుకు ఖండించలేదు?
- 'మన యుద్ధ విమానాలు కూలినయ్' అంటూ సీడీఎస్ అనిల్ చౌహాన్ ప్రకటించారు. మన వైమానిక దళానికి నష్టం జరిగితే.. ప్రభుత్వం ఎందుకు ముందే ప్రకటన చేయలేదు? దాపరికాలకు ఎందుకు పోయింది?
- మన ప్రతీకార దాడులతో పాక్ వణికిపోయి కాళ్లబేరానికి వచ్చిందని మీరు (ప్రధాని మోదీ) చెప్పారు. అలాంటప్పుడు కాల్పుల విరమణకు ఎందుకు అంగీకరించారు?
- యుద్ధంలో మనదే పైచేయి అయితే.. పాక్ ప్రజలు, అక్కడి ఆర్మీ ఎందుకు సంబురాలు జరుపుకొన్నది?
- మన చేతిలో పాక్ చావుదెబ్బ తింటే.. పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ మునీర్‌కు ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి ఎందుకు లభించింది?
- పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన ముష్కరుల గురించి తెలిసినా.. ఇంకా ఎందుకు పట్టుకోలేదు?
- పహల్గాం సూత్రదారులు పాక్‌లో పలు ర్యాలీల్లో పాల్గొన్నారు. అయినా వారిని ఎందుకు పట్టుకోలేదు?
- పహల్గాం ఉగ్రదాడి విషయంలో యూఏఈ, కొలంబియా, యూఎస్ వంటి మిత్ర దేశాల మద్దతును కూడా మనం ఎందుకు కూడగట్టలేకపోయాం?
- ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాక్‌ను అంతర్జాతీయ సమాజం ముందు దోషిగా నిలబెట్టడంలో ఎందుకు విఫలమయ్యాం?

- పాక్‌కు ఐఎంఎఫ్ బెయిల్ అవుట్ ప్యాకేజీ రాకుండా అడ్డుకోవడంలో ఎందుకు ఫెయిల్ అయ్యాం?
- భారత్‌లో ఉంటూ పాక్‌కు గూఢచర్యం చేస్తున్న 15 మందిని నెల వ్యవధిలో పట్టుకొన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ముందే వీళ్లను ఎందుకు గుర్తించలేదు? మన నిఘా వ్యవస్థ ఏం చేస్తున్నది??
- తాము ఎల్లప్పుడూ ఉగ్రవాదానికి వ్యతిరేకమన్న చైనా.. ఆ మరుసటి రోజే పాక్‌కు అండగా నిలిచింది. దీన్ని మన ప్రభుత్వం దౌత్యపరంగా ఎందుకు ప్రశ్నించడం లేదు?
- పాక్‌కు మనం సింధూ జలాలను నిలిపేశాం. దీంతో మనకు బ్రహ్మపుత్ర జలాలను నిలిపేస్తామంటూ చైనా ఇప్పుడు బెదిరిస్తుంది. చైనా వైఖరిని ఎందుకు నిలదీయట్లేదు?

ఉగ్రవాదులతో లింకులు.. ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగుల డిస్మిస్

జమ్ముకశ్మీర్ ఎల్జీ నిర్ణయం

శ్రీనగర్: ఉగ్రవాదులతో సంబంధాలున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులను జమ్ము కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మంగళవారం డిస్మిస్ చేశారు. దేశ భద్రత దృష్ట్యా రాజ్యాంగంలోని 311(2)(సి) ప్రకారం ఒక ప్రభుత్వ వైద్య కళాశాలలో పని చేసే క్లర్క్, ఒక పోలీస్ కానిస్టేబుల్, ఒక స్కూల్ టీచర్‌ను సస్పెండ్ చేసినట్టు ఎల్జీ కార్యాలయం పేర్కొంది. ఈ ముగ్గురికి లష్కరే తాయిబా, హిజ్బుల్ ముజాహిదీన్‌తో సంబంధాలున్నాయని తెలిపింది.

పంజాబ్‌లో పాక్ గూఢచారి అరెస్ట్

చండీగఢ్: 'ఆపరేషన్ సిందూర్' జరుగుతుండగా భారత సైన్యం కదలికలు, వ్యూహాత్మక ప్రాంతాల సమాచారాన్ని పాకిస్థాన్ ఐఎస్ఐ ఏజెంట్లకు పంపిన గగన్‌దీప్ సింగ్ వురపు గగన్‌ను అరెస్ట్ చేశారు. ఈ సమాచారంతో కూడిన మొబైల్ ఫోన్‌ను అతని నుంచి స్వాధీనం చేసుకున్నారు. దేశ భద్రతకు ముప్పు కలిగించే సమాచారాన్ని పాక్ ఐఎస్ఐ ఏజెంట్లకు అందజేశాడని పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. మరోవైపు, పాక్‌కు సమాచారం చేరవేస్తున్న రాజస్థాన్ ప్రభుత్వ ఉద్యోగి షకుర్ ఖాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

నష్టాలు కాదు.. ఫలితమే ముఖ్యం

- ఆపరేషన్ సిందూర్‌లో భారత్‌కు నష్టంపై సీడీఎస్ చౌహాన్ మరోసారి కీలక వ్యాఖ్యలు
- టెస్ట్ క్రికెట్‌లో ఇన్నింగ్స్ తేడాతో గెలిచినప్పుడు వికెట్లు, బంతులతో ఇక పనేంటని ప్రశ్న

పుణె, జూన్ 3: ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత్‌కు జరిగిన నష్టాలపై తాను చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయిన నేపథ్యంలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) అనిల్ చౌహాన్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత సైన్యానికి జరిగిన నష్టాలు ముఖ్యం కాదని, ఆపరేషన్ ఫలితం ఏమిటన్నదే ముఖ్యమని ఆయన అన్నారు. మంగళవారం పుణె యూనివర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ తమ తప్పులను గుర్తించి, సరిదిద్దుకునే సత్తా సాయుధ దళాలకు ఉందని, ఎదురుదెబ్బలకు చేష్టలుడిగి చూస్తూ నిలుచోలేదని వ్యాఖ్యానించారు. 'మన వైపున జరిగిన నష్టాల గురించి కొందరు నన్ను అడిగారు. ఇదంత ముఖ్యం కాదని నేను చెప్పాను. ఫలితాలు ఏమిటి.. మనం ఎలా వ్యవహరించాం అన్నదే ముఖ్యం. నష్టాల గురించి మాట్లాడడం అంతసబబు కాదు. మీరే క్రికెట్ టెస్ట్ మ్యాచ్ ఆడి ఇన్నింగ్స్ తేడాతో గెలుపొందారనుకోండి. ఇక ఎన్ని వికెట్లు, ఎన్ని బంతులు, ఎంతమంది ప్లేయర్లు అన్న ప్రశ్నే ఎక్కడుంది?" అని సీడీఎస్ ప్రశ్నించారు. కాగా, గత వారం సింగపూర్‌లో బ్లూమ్‌బర్గ్ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో సీడీఎస్ చౌహాన్ చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఆపరేషన్ సిందూర్ ప్రాథమిక దశలో భారతీయ యుద్ధ విమానాలకు నష్టం జరిగిందని ఆయన అంగీకరించారు. అయితే సాయుధ దళాలు వెంటనే తమ తప్పులను సరిదిద్దుకుని మళ్లీ శత్రువుపై దాడి చేశాయని ఆయన చెప్పారు. నాలుగు రాఫెల్ విమానాలతోసహా మొత్తం ఆరు భారతీయ యుద్ధ విమానాలను తాము కూల్చివేసినట్లు పాకిస్థాన్ చేస్తున్న ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. అది అవాస్తవమని స్పష్టం చేశారు.

ఆగస్టు 14లోపే బీటెక్ అడ్మిషన్లు క్లోజ్

- ల్యాటరల్ ఎంట్రీవి కూడా
- అన్ని రాష్ట్రాలకు ఏఐసీటీఈ ఆదేశాలు జారీ
- ఆగస్టు 14 నుంచే ఫస్టియర్ క్లాసులు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): బీటెక్ ఫస్టియర్ అడ్మిషన్లను ఆగస్టు 14లోపు ముగించాలని అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఆదేశించింది. పాలిటెక్నిక్ కోర్సులు పూర్తిచేసిన వారికి బీటెక్ సెకండియర్‌లో అడ్మిషన్లు కల్పించే ల్యాటరల్ ఎంట్రీ అడ్మిషన్లను సైతం ఆగస్టు 14లోపే పూర్తిచేయాలని గడువు విధించింది. ఇంజినీరింగ్ ఫస్టియర్ క్లాసులను ఆగస్టు 14 నుంచే ప్రారంభించాలని ఇటీవల ఏఐసీటీఈ అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. నిరుడు అక్టోబర్ 23 లోపు పూర్తిచేయాలని ఆదేశించగా, ఈ సారి ఆగస్టులోపే పూర్తిచేయాలని ఏఐసీటీఈ ఆదేశాలిచ్చింది. అంటే విద్యాసంవత్సరం దాదాపు రెండు నెలలు ముందుకు జరగనున్నది. ఈనెల 30లోపు తాము ఇంజినీరింగ్ కాలేజీలకు అనుమతులిస్తామని, జూలై 31లోపు యూనివర్సిటీలు, బోర్డులు అనుమతులిచ్చుకోవచ్చని తెలిపింది. పీజీడీఎం, పీజీసీఎం కోర్సుల్లో అడ్మిషన్లకు జూలై 31 గడువుగా విధించింది. ఆగస్టు 1 నుంచి క్లాసులు నిర్వహించాలన్నది. దేశంలోని సాంకేతిక విద్యాసంస్థలకు ఏఐసీటీఈ ఏటా అనుమతులిస్తున్నది.

అన్నింటికీ అనుమతులొచ్చేనా.. ?

తెలంగాణలో 175 ఇంజినీరింగ్ కాలేజీలున్నాయి. ఏఐసీటీఈ ఇచ్చిన మొత్తం సీట్లకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడంలేదు. 2024-25 విద్యాసంవత్సరంలో ఏఐసీటీఈ 1,29,367 ఇంజినీరింగ్ ఫస్టియర్ సీట్లకు అనుమతి ఇచ్చింది. అయితే జేఎన్టీయూ, సాంకేతిక విద్యాశాఖలు 1,18,778 సీట్లకు మాత్రమే అనుమతులు ఇచ్చాయి. వీటిలో కన్వీనర్ కోటా, యాజమాన్య కోటా సీట్లున్నాయి. అంటే ఏఐసీటీఈ అనుమతి ఇచ్చిన వాటిలో 10,589 సీట్లకు రాష్ట్రం కోతపెట్టింది. మరో 14 కాలేజీల్లో కోర్సుల కన్వర్షన్‌కు అనుమతి ఇవ్వకపోవడంతో మరో 7వేల సీట్లకు కోతపడనున్నది. ఈ సారి ఏఐసీటీఈ ఇచ్చిన మొత్తం సీట్లకు రాష్ట్రప్రభుత్వం అనుమతిస్తుందా..? అన్న అనుమానాలొస్తున్నాయి.

సంక్షిప్త వార్తలు

వర్షాకాల సమావేశాల్లోనే జస్టిస్ వర్మపై అభిశంసన

న్యూఢిల్లీ: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన తీర్మానాన్ని రానున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఆయనపై చర్య తీసుకోవడానికి అన్ని పార్టీల ఏకాభిప్రాయం కోసం ప్రభుత్వం ప్రయత్నించబోతున్నది. జస్టిస్ వర్మ ఇంట్లో భారీగా నోట్ల కట్టలు దొరకడం కలకలం రేపిన విషయం తెలిసిందే.

రష్యా-క్రిమియా వంతెన పేల్చేశాం: ఉక్రెయిన్

కీవ్: ఆపరేషన్ స్పైడర్ వెబ్‌తో రష్యాలోని ఎయిర్‌బేస్‌లపై దాడి చేసి 40కిపైగా యుద్ధవిమానాలను ధ్వంసం చేసిన ఉక్రెయిన్ తాజాగా మరోషాక్ ఇచ్చింది. రష్యాను, ఆక్రమిత క్రిమియాను కలిపే వంతెనను నీటి కింద అమర్చిన బాంబులతో పేల్చివేసినట్లు ఉక్రెయిన్‌కి చెందిన నిఘా సంస్థ ఎస్‌బీయూ మంగళవారం ప్రకటించింది. ఇందుకు సంబంధించిన రెండు వీడియోలను కూడా ఎస్‌బీయూ విడుదల చేసింది. అయితే ఉక్రెయిన్ వాదనపై రష్యా ఇంకా స్పందించలేదు.

శుభాన్షు రోదసి యాత్ర జూన్ 10కి వాయిదా

ఫ్లోరిడా: భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా సహా నలుగురు వ్యోమగాములు ఐఎస్ఎస్‌కు పంపేందుకు చేపట్టిన ఏఎక్స్-4 ప్రోగ్రాం మరోమారు వాయిదా పడింది. తాజాగా కొన్ని నిర్వహణపరమైన సర్దుబాట్లు, క్వారంటైన్ ప్రొటోకాల్స్ కారణంగా జూన్10న మిషన్ ప్రయోగాన్ని చేపట్టబోతున్నట్టు సంస్థ ప్రకటించింది. అమెరికా ప్రైవేట్ సంస్థ 'ఏక్సం స్పేస్'కు చెందిన 'ఏఎక్స్-4 మిషన్'ను మే 29న చేపట్టాలని తొలుత నిర్ణయించారు. కానీ మిషన్ ప్రయోగాన్ని జూన్ 8కి వాయిదా వేశారు.

జీ7 సదస్సుకు భారత్‌కు అందని ఆహ్వానం!

న్యూఢిల్లీ: కెనడాలో జూన్ 15 నుంచి 17 వరకు జరగనున్న జీ7 సదస్సులో పాల్గొనేందుకు భారత్‌కు ఇంకా ఆహ్వానం అందలేదు. గడచిన ఆర్నెళ్లలో మొట్టమొదటిసారి జీ7 సదస్సులో ప్రధాని మోదీ పాల్గొనడం లేదు. ఒకవేళ కెనడా నుంచి ఆహ్వానం అందినా రెండు దేశాల మధ్య ప్రస్తుతం సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో ఆ సదస్సులో ప్రధాని పాల్గొనేందుకు విస్తృతంగా గ్రౌండ్‌వర్క్ చేయాల్సి ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత్, పాక్ మధ్య మధ్యవర్తిత్వానికి అమెరికాను అనుమతించి తప్పు చేసిన తర్వాత ఇది మరో దౌత్యపరమైన భంగపాటని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది.

ఓటింగ్ శాతం వెల్లడికి కొత్త విధానం: ఈసీ

న్యూఢిల్లీ: ఓటింగ్ శాతాన్ని ఎప్పటికప్పుడు అందజేసేందుకు టెక్నాలజీతో నడిచే క్రమబద్ధీకరించిన విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఎన్నికల కమిషన్ మంగళవారం ప్రకటించింది. గతంలో మాన్యువల్‌గా చేసే పద్ధతులతో కాలహరణం జరిగేదని, ఈ కొత్త విధానంతో అది తొలగిపోగలదని ఈసీ తెలిపింది. ఈ కొత్త విధానంలో ప్రతి పోలింగ్ స్టేషన్‌కి చెందిన ప్రిసైడింగ్ అధికారి నేరుగా ఓటింగ్ శాతాన్ని కొత్తగా ప్రవేశపెట్టిన ఈసీఐనెట్ అప్లికేషన్‌లో ప్రతి రెండు గంటలకు ఎంటర్ చేస్తారు.

దక్షిణ కొరియా అధ్యక్షుడిగా లీ జే-మ్యుంగ్

సియోల్: దక్షిణ కొరియాలో మంగళవారం జరిగిన దేశాధ్యక్ష ఎన్నికల్లో లిబరల్ పార్టీ అభ్యర్థి లీ జే-మ్యుంగ్ 85 శాతానికిపైగా ఓట్లతో ఘన విజయం సాధించారు. ఆయన కన్జర్వేటివ్ ప్రత్యర్థి, పీపుల్స్ పవర్ పార్టీ అభ్యర్థి కిమ్ మూన్-సూ ఓటమిని అంగీకరించారు. 2024లో అప్పటి దేశాధ్యక్షుడు యూన్ సుక్ యూల్ విధించిన మార్షల్ లాపై ఇది 'తీర్పు దినం' అని లీ చెప్పారు. లీ నేతృత్వంలోని పార్లమెంటు యూన్‌ను నిరుడు డిసెంబరులో అభిశంసించింది.

పాక్‌లో భూకంపం.. 200 మంది ఖైదీలు పరారీ

న్యూఢిల్లీ: 'ఆపదలో అవసరం' అనే నానుడిని కరాచీలోని మలిర్ జైలు ఖైదీలు చక్కగా ఉపయోగించుకుని తప్పించుకున్నారు! వారం రోజులుగా కరాచీలో సంభవిస్తున్న స్వల్ప భూ ప్రకంపనలను అదనుగా భావించి 200 మందికి పైగా ఖైదీలు జైలు నుంచి బయటపడ్డారు. గత సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. పారిపోయిన వారిలో మత్తు పదార్థాల సంబంధిత నేరాలకు పాల్పడినవారు ఉన్నారు. వారిలో చాలా మంది మానసిక సమస్యలతో బాధ పడుతున్నారు.

మీరేమైనా చరిత్రకారులా?

- కన్నడ వివాదంపై కమల్‌కు కర్ణాటక హైకోర్టు ప్రశ్నలు
- క్షమాపణ చెబితే సమస్య సమసిపోతుందని వ్యాఖ్య
- క్షమాపణ చెప్పబోనన్న కమల్

బెంగళూరు: తన కొత్త చిత్రం "థగ్ లైఫ్"ని కర్ణాటకలోప్రస్తుతానికి విడుదల చేయకూడదని నటుడు కమల్ హాసన్ నిర్ణయించుకున్నట్లు ఆయన తరపు న్యాయవాది మంగళవారం కర్ణాటక హైకోర్టుకు తెలియచేశారు. కాగా, ఈ ప్రకటన రావడానికి ముందు కన్నడ భాష పుట్టుకపై కమల్ చేసిన వ్యాఖ్యలను కర్ణాటక హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. తమిళ భాష నుంచి కన్నడ భాష పుట్టిందని కమల్ చేసిన వ్యాఖ్యలను కోర్టు ప్రశ్నించింది. ఏ ఆధారాలతో మీరు ఆ వ్యాఖ్యలు చేశారని కమల్‌ని నిలదీసిన హైకోర్టు మీరేమైనా చరిత్రకారులా? భాషావేత్తలా? అని ప్రశ్నించింది. కమల్ వ్యాఖ్యలు కర్ణాటక ప్రజల మనోభావాలను గాయపరిచాయని పేర్కొన్న జస్టిస్ ఎం నాగప్రసన్న.. కన్నడ ప్రజలకు క్షమాపణ చెప్పడానికి ఎందుకు నిరాకరిస్తున్నారని కమల్ తరపు న్యాయవాదిని ప్రశ్నించారు. భాష అన్నది ప్రజల భావోద్వేగ, సాంస్కృతిక ఉనికిగా న్యాయమూర్తి అభివర్ణించారు. ఒక భాషకు చెందిన యావత్ సమాజం ప్రతిష్టను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసే హక్కు ఏ వ్యక్తికీ లేదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. "అ విధమైన వ్యాఖ్యలు చేయడానికి మీరేమైనా చరిత్రకారులా లేక భాషావేత్తా? ఏ భాష మరో భాష నుంచి జన్మించదు. ఒక చిన్న క్షమాపణతో ఈ మొత్తం సమస్య పరిష్కారం అయ్యేది" అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. థగ్ లైఫ్ చిత్రాన్ని కర్ణాటకలో నిషేధిస్తున్నట్లు కర్ణాటక ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ (కేఎఫ్‌సీసీ) ప్రకటించిన దరిమిలా తన చిత్రం సజావుగా విడుదలయ్యేందుకు జోక్యం చేసుకోవాలని, థియేటర్ల వద్ద భద్రత కల్పించాలని కోరుతూ కమల్ హాసన్ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిగింది. కర్ణాటకలో తన చిత్ర ప్రదర్శనను కేఎఫ్‌సీసీతోసహా ఏ ఒక్కరూ అడ్డుకోకుండా ఆదేశాలు జారీచేయాలని కమల్ సొంత నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ ఈ పిటిషన్ దాఖలుచేసింది. తమ చిత్ర ప్రదర్శనపై ప్రకటించిన నిషేధాన్ని అడ్డుకోని పక్షంలో చిత్రం విడుదలను నిలిపివేయాలని కమల్ నిర్ణయించుకున్నట్లు న్యాయవాది కోర్టుకు తెలిపారు. కర్ణాటకలో థగ్ లైఫ్ చిత్రం విడుదల